కథ

# పతి పత్నీ ఔర్ ఓ...

- నాగసాయి రమ్య

జాను... వారిద్దరూ మాట్లాడుకుంటున్నారు.
ఒకర్నొకరు తమకంగా చూసుకుంటూ, తన్మయత్వానికి లోనవుతూ-
సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.
క్యూట్ క్యూట్ లుక్స్‌తో ఆమె మెస్మరైజ్ చేస్తుంటే.... హాట్‌హాట్‌గా అతను ఎంజాయ్ చేస్తున్నాడు.
ఒకే సోఫాని సగం సగం పంచుకుంటూ.... 'స్వీట్ నథింగ్స్'తో ఆ ఇద్దరూ మునిగి తేలుతున్నారు.
లోగొంతుతో మాటాడినా... గుండె చప్పుడు కూడా విన్పించేంత దగ్గరితనం అనుభవిస్తున్నారు.
అయితే, వారి మనసులకీ, మాటలకీ వారధి కడుతున్నాయి వారి చేతుల్లోని 'మొబైల్స్'
అవును, వారిద్దరి దగ్గర ముద్దొచ్చే సెల్‌ఫోన్లున్నాయి.

ఇంతకీ అతనెవరో కాదు... అందరికీ తెలిసిన మానినీ మానసచోరుడు మాధవన్.

ఆమె కూడా అంతే! యూత్‌హార్ట్‌లపై కన్నేసి కాటుక కళ్లతో కాటేసి, కాట్‌వాక్ చేసేసే బాలీవుడ్ బ్యూటీ విద్యాబాలన్.

మోడ్రన్ లైఫ్‌స్టయిల్‌ని హృద్యంగా పోట్రయిట్ చేసినట్లున్న ఆ యాడ్ తెగ నచ్చిందతనికి.

అతనూ మాధవుడే. చిత్రంగా అతని భార్య పేరూ విద్యే.

'ఎక్స్‌ప్రెస్ యువర్‌సెల్ఫ్'!

''ఒరేయ్...'' ఓ తేనె చుక్కని చప్పరించిన వెంటనే గొంతు సవరించుకుని విష్ చేసినట్లుంటుంది ఫోన్‌లో విద్య పలకరిస్తే.

మాటల మధ్యలో ప్రొవోక్ చేస్తూ హస్కీనెస్. చిన్నజీర. ఆమె స్వరం వింటే చాలు... పదునైన కత్తితో సన్నగా గుండెను కోస్తున్న ఫీలింగ్ మాధవ్‌కి. ఒక్కసారిగా ఉప్పెనలా నరనరాల్లో విద్యుత్ ప్రవాహం. ఆమె ఫోనొస్తే అతను ఉక్కిరిబిక్కిరవుతాడు. కుదురుగా ఓ క్షణం కూర్చోలేడు. వెర్రెత్తిన మోహావేశంలో తననితానే మరచిపోతాడు.

ఇప్పుడూ అంతే!

''ఏం చేస్తున్నావురా?'' గ్రీష్మతాపంలో తొలకరి చినుకులాంటి పలకరింపు.

అతడు ఆన్సరిచ్చే లోపునే విద్య మళ్లీ అడిగింది- ''నేనల్లిన 'స్వీట్‌మెమోరిస్' దిండుని హగ్ చేసు కుంటున్నావా?'' నవ్వాడు మాధవ్.

''ఏడ్వలేక నవ్వినట్లుంది. హాయిగా నవ్వితే ఆస్తేంపోదు...'' కొంటెగా టీజ్ చేస్తోంది విద్య. ఒకప్పటి కాలేజ్‌మేట్. ఇప్పటి సోల్‌మేట్. తొలిపరిచయం స్నేహమై, ప్రణయమై, పరిణయంగా పరిణతి చెందింది. ఒకనాటి ప్రేయసి కాస్తా పెళ్లాంగా ప్రమోషన్ కొట్టేసింది. దాంతో... మాధవ్ దగ్గర ఆమెకు బోల్డంత చనువు. అందుకే.... ఏమాత్రం తటపటాయింపులేకుండా బోల్డ్‌గా మాట్లాడేస్తుంది.

''ఏం చెప్పనే నా బాధ. పక్క కుదరని లోన్లీనెస్. కనురెప్పలెంత బలవంతంగా మూసినా నిద్ర రావట్లేదు. అడ్జస్టవలేక బెడ్‌పై అటూఇటూ దొర్లుతున్నాను...'' విరహం వంటిని కాల్చేస్తుంటే తట్టుకోలేక అల్లాడిపోతున్న స్థితిని మాటల్లోకి అనువదించాడు మాధవ్.

''సారీరా...?''

''ఇవాళ మన మారేజ్‌డే. అదీ మొట్టమొదటిది. రోజూ ఉండే కొలువే కదా... సెలవ్ పెట్టలేకపోయావు'' బాధగా మాధవ్.

''నువ్వెందుకు లీవ్ పెట్టలేదురా?''

''ఆడిటింగ్... కుదరలేదులే..'' సన్నగా నసిగాడు మాధవ్.

''ఇక్కడా డిటోనే. ఇలాంటి రిగ్రెట్స్ ఉండకూడదనే... పెళ్లవగానే జాబ్ మానేస్తానన్నాను. ఆ ప్రపోజల్ పడనివ్వలేదు''.

మాధవ్ మరి సమాధానం చెప్పలేదు.

''నువ్వే కొన్నాళ్లు ఇద్దరం సంపాదిస్తే ఫైనాన్షియల్‌గా సెటిలవొచ్చు, ఫ్యూచర్ బాగుంటుంది.. అన్నావు. ఔనా!''

''అన్నాను..''

''లైఫ్ కంఫర్టబుల్‌గా ఉండాలంటే... కొన్నిటిని ఓర్చుకోవాల్సిందే. అవ్వా, బువ్వాకావాలంటే దొరకదు కదా! దేనికైనా ఎడ్జస్ట్ అవ్వాల్సిందే. నీకో సంగతి చెప్పనా... ఉడుక్కోకూడదు. కత్రినా కంటే కత్తిలా ఉంటానని, మొగుడిగా వస్తేగిస్తే సల్మాన్ లాంటోడే రావాలని పెళ్లికాక ముందు అనుకునే దాన్ని, హజ్బెండ్‌గా నువ్వు ఎంట్రీ ఇచ్చావ్. ఎడ్జస్ట్ అవట్లేదూ?''

''ఒసేయ్...!'' గట్టిగా అరిచాడు.

''కాలిందా?''

''నువ్వూ కుళ్లుకోనంటే నేనోమాట చెప్తాను. ఓ రెండు మూడు యాంగిల్స్‌లో నా ముందు ఆ 'పోకిరి' దిగదుడుపే. నా లైఫ్‌లో కనీసం గోవా బ్యూటీ ఇలియానా అరంగేట్రం చేయాల్సింది. ప్చ్! ఏం చేస్తాం? తెల్లచీరా, పాలగ్లాసుతో నువ్వొచ్చావ్. నేనూ ఎడ్జస్టే''.

''రిటార్ట్ చాలుగాని... ఫోనెందుకు చేసానంటే?''

''ఆ మిస్టర్ పెళ్లాం... ఈ మిసెస్ హజ్బెండ్‌కి పెళ్లి రోజు శుభాకాంక్షలందించడానికి ... ఔనా!''

''నన్ను చెప్పనీరా... మనసుకి నచ్చిన నా భర్త గారికి హేపీ వెడ్డింగ్ డే గ్రీటింగ్స్. నన్నెంతగానో ప్రేమిస్తున్న నా మొగుడుగారికి మొట్టమొదటి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు''.

''నీకూ మన పెళ్లి రోజు శుభాకాంక్షలే. మనిద్దరం ఇలాగే కొట్టుకుంటూ, తిట్టుకుంటూ, మధ్య మధ్య ప్రేమను తింటూ, తాగుతూ కలకాలం గడిపేయాలని మనసావాచా కోరుకుంటున్నానే...'' నాన్ స్టాప్‌గా అనేసాడామాటల్ని.

''థాంక్యూరా! అన్నట్టు... ఒరేయ్... ఈ సందర్భంలో నీకు అన్‌లిమిటెడ్ ఫ్లయింగ్ కిస్సెస్. అందుకో...'' ముద్దులన్నీ ఫోన్‌లో పంపిస్తోంది విద్య,

''నా తరపున కిస్‌మిస్‌లాంటి ఓ కిస్సే...'' అన్నాడు మాధవ్.

ఆ తర్వాత ఒక్కక్షణం వారిద్దరూ మాటాడుకో లేదు. సరిగ్గా ఏడాది కిందటే ఇదేరోజున ఆహూతులు, ఆత్మీయుల సమక్షంలో... వేదమంత్రాలు, మంగళవాద్యాల సాక్షిగా కళ్యాణ మండపంపై ఇద్దరూ ఒక్కటైన మనోహర దృశ్యం కళ్ల ముందు ఆవిష్కృతమైనట్లుంది. పెళ్లి తంతుతో ఒకేమాట, ఒకే బాట, ఒకే గమ్యంగా సాగుతూ నూరేళ్ల సహజీవన సౌభాగ్యం అందుకోవడంలోని మజాని మరొక్కసారి వారు గుర్తు చేసుకుంటున్నట్టున్నారు. 'బ్రహ్మముడి' పడగానే 'ఈ అమ్మాయి ఇకనుంచీ నా సొంతం. నా పెళ్లాం' అని అతగాడు అనుకోవడం, 'ఈ అబ్బాయి నా వాడు, నా మొగుడు' అని ఆమె తలపోయడం అపురూపమైన 'అర్ధనారీశ్వర' తత్వానికి అచ్చమైన, స్వచ్ఛమైన నిదర్శనమైతే–

ఆ అమ్మాయి విద్య. ఆ అబ్బాయి మాధవ్.

ముందుగా తేరుకున్న విద్య అంది – ''ఉన్నపాటున రెక్కలు కట్టుకుని నీముందు వాలిపోవాలని... నిన్ను ముద్దుల్తో ముంచెయ్యాలని.. ఈ అర్ధరాత్రి ఆరుబయట వెన్నెల్లో చెట్టాపట్టాలేసుకుంటూ చెడ తిరగాలని... ఇంకా ఏదేదో చేయాలని పిచ్చిపిచ్చిగా అనిపిస్తోంది. అవున్రా... ఈ వెడ్డింగ్ డేని వీకెండ్‌లో సెలబ్రేట్ చేసుకోకూడదా?'' గోముగా అడుగుతోంది విద్య.

''ఒసేయ్... మన పెళ్లిరోజంటే మనదైన స్పెషల్ ఈవెంట్. కేవలం మనిద్దరికి మాత్రమే సంబంధించిన జీవనోత్సవం.

అరుదైన ఈ సెలబ్రేషన్‌ని వీలు కుదిరినప్పుడు జరుపుకోవడం న్యాయమా?''

''అయితే.. టూఅవర్స్ ఆగు. లాగవుట్ అవగానే నీ ముందుకొచ్చి వాల్తా! మళ్లీ మరోసారి శోభనం జరుపుకుందాం. మల్లెలు. మరువాలు సిద్ధం. యుద్ధరంగానికి నువ్వు సిద్ధమేనా మాధవా?''

''కమాన్.. బరిలోకి దిగేందుకు నేను సిద్ధం. ఓడిపోతే మహారాణిగారేమిచ్చుకుంటారో?''

''ఉన్నదంతా నీకే ఊడ్చి ఇచ్చేస్తుంటే... ఇంకా ఇచ్చేందుకు నా దగ్గరే ముంటుంది?'' ఫోన్‌లోనే కవ్విస్తోంది విద్య.

''సరే...రా! తూర్పు రాగరంజితమవకుండా వేగం రా!'' అంటూనే వాల్‌క్లాక్ వంక చూసాడు మాధవ్.

గాఢపరిష్వంగంలో చిన్నముల్లు, పెద్దముల్లూ. గుండెల్లో పాముపిల్లలా మెలికలు తిరిగిన జెలసీ.


***

గదిలో దూరిన విద్య ఎంతకీ బయటకి రాలేదు. చూద్దామనుకున్నాడు మాధవ్. తలుపులు దగ్గరగా వేసున్నాయేమో... తోయగానే ఇట్టే తెరుచుకున్నాయి. ఆమె ఉలిక్కిపడి చూసింది. వచ్చింది భర్తే అయినా... తానున్న స్థితిలో దేహాన్ని చుట్టుకున్న సగం వలువలు ఏ అందాలను దాచాలో, వేటిని బహిర్గతపరచాలో తెలీని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఫాన్ గాలికి ఎగిరి పడుతున్న ముంగురులు కొత్త సింగారాన్ని తీసుకొస్తే... పిచ్చెక్కించేలా నడుం దగ్గరి చిన్నిమడత. వెన్నెల్లో గోదారితిన్నెలా కనిపిస్తున్న నాభి. అంతే కాదు... పైట చెరగు అడ్డులేని అందాలు.... పంజరంలో చిక్కుకున్న పావురాల్లా కువకువలాడే పరువాలు. ఊపిరి తీస్తున్నప్పుడల్లా ఎగిరెగిరి పడుతున్న జంట సోయగాలవి.

బంగారుఛాయలో మెరిసిపోతున్న ఆ స్వర్ణ కలశాలను కళ్లింతలు చేసుకుని మరీ చూస్తున్నాడు మాధవ్.

'ఐఫీస్ట్' అదేనేమో? ఒక్కో అందాన్ని చూపుల్తోనే తడిమేస్తున్నాడు.

ఒక్క క్షణంలో తేరుకున్న విద్య అంది – ''సిగ్గులేదూ! ఆడాళ్లు బట్టలు మార్చుకుంటుంటే లోనికి రావడానికి...?''



''అన్నేసి అందాలు ఎగ్జిబిషన్‌లో పెడితే మొగుడైన మగాడూరుకుంటాడా?'' అంటూ ఆమెని దొరకపుచ్చుకున్నాడు.

''వదుల్రా.. దొంగభడవా!''

''ఓహో... వదులుగా ఉందా? గట్టి పట్టుపడతానులే..'' బిగియారా కౌగిలించుకున్నాడు.

''ప్రశాంతంగా బట్టలు కూడా మార్చుకోనీయవా?'' విసుక్కుంటున్న ఆమెను రెండు చేతుల్తో పొదివి పట్టుకుని డబుల్‌కాట్ దగ్గరికి తీసుకెళ్లాడు.

''ఇద్దరే ఉన్న ఈ ఇంట్లో అంత రహస్యంగా డ్రస్ మార్చుకోవాలా?'' మాధవ్ ప్రశ్న.

''అంటే..'' కళ్లు టపటపలాడిస్తూ అడిగిందామె.

''సాయం చేసేందుకు నేను లేనా...అని''

''ఓహో... ఉన్నావులే... గొప్ప సాయం చేసేవాడివి...''

''అవునే.. బూత్‌రూంలో సరిగంగ స్నానం చేసేందుకు పనికొచ్చిన వాడిని, నీకందని నీ వీపుని అందుకుని సోప్ రాసేందుకు పనికొచ్చిన వాడిని... డ్రస్ మార్చుకుంటుంటే చూసేందుకు నే పనికి రానా?''

గలగలా మల్లెలు రాలిపడ్డట్టు ఆమె నవ్వింది.

"బొత్తిగా మాట వినకుండా పోతున్నావ్... నిన్నిలా వదిలేయకూడదే... ఇంతకు ఇంత శిక్ష విధించాల్సిందే..." అంటూ మరింతగా హత్తుకు న్నాడు. ఆ తర్వాత విద్వాంసుడైన వైణికుడు వీణ తీగెల్ని సవరిస్తున్నట్లు ఆమె శరీరంలో ప్రతి భాగాన్నీ నేర్పుగా, ఓర్పుగా అతను తడుము తున్నాడు. వేవేల రాగాలు ఒక్కసారిగా స్వరాలు సవరించుకున్నాయి. ఒకచోట చేరి పులకింతల పాట కచేరి చేస్తున్నాయి. ఒక్కో చోట ఒక్కో స్పర్శ. ఒక్కో రీతిగా రసస్పందన. మత్తులో బరువెక్కిన కనురెప్పలు వాలిపోతుంటే... అతడ్ని మరింత దగ్గరగా హత్తుకుంది విద్య.


"నాకు తెలీని సీక్రేట్స్ ఏమున్నాయి నీలో? నీ అణువణువూ నాకు పరిచితమే".

"అవునా?" అతడి ఛాతిపై ఉన్న ఓ వెంట్రుకను సుతారం లాగింది. గుండె ఝల్లంది మాధవ్‌కి.

"అలవాటైన దార్లో అలవోకగా ప్రయాణించడం ఎంతో సులువు. చీకట్లోనూ హాయిగా సాగిపోగలం. గమ్యాలను చేరుకోగలం. నీ సన్నిధిలో, రహస్యాన్వేషణలో నాకు ప్రతి రాత్రీ అత్యద్భుత సాహస యాత్రే!"

చిన్నగా నవ్వాడు.

"శిఖరాలు, లోయలు తెలిసిన వాడిని. ఎత్తులు, పల్లాల సంగతి ఎరిగిన వాడిని. మలుపులు, మెలికలు, వంపుసొంపుల మర్మాలు అవగాహన ఉన్న వాడిని. ఏవేవి ఎక్కడెక్కడున్నాయో... చెప్పలేనా?" అన్నాడు మాధవ్.



అప్పుడు విద్య చామంతి చెక్కిళ్లు రక్తవర్ణం పులుముకున్నాయి.

ఆమె ఏదో చెప్పబోతుండగా.... ఆమె పెదాలను తన పెదాలతో బంధించాడు మాధవ్.

అలా ఎంతసేపో? ఎంతకైపో?

సరిగ్గా ఆవేళలో..

కాలింగ్ బజ్జర్ మోగింది.

ఉలిక్కిపడి లేచి కళ్లు నలుపుకుని చుట్టూ చూసాడు మాధవ్.

డబుల్ కాట్‌పై ఒకే ఒక్కడు.

"విద్య నా పక్కన లేదా? అంటే... అదంతా కలా, కలైనా ఎంత బాగుంది?" నవ్వుకుంటూ వెళ్లి తలుపు తెరిచాడు.

విద్య లోనికి వచ్చింది. ఆమెతో పాటు తొలి వేకువ కిరణమొకటి ఇంట్లో కాలుపెట్టింది.

వానిటీబేగ్ టేబుల్‌పై గిరాటేసి... మంచినీళ్లు తాగి పక్కమీద క్షణమాలస్యం చేయకుండా నిద్రలోకి జారుకుంది విద్య.

ఆ పరిస్థితిలో ఆమెను డిస్టర్బ్ చేయదలచుకోలేదు మాధవ్.

***

ఆఫీసుకెళ్లబోతూ ట్రాఫిక్ సిగ్నల్ పడితే స్కూటరాపి పబ్లిక్ హోర్డింగ్‌లో కనిపిస్తున్న మాధవన్, విద్యాబాలన్‌లనే చూస్తున్నాడు మాధవ్.

ఇంతలో సెల్ మోగింది. ఇంటినుంచి విద్య.

"హాయ్... విద్యా!"

"నువ్విప్పుడెక్కడున్నావో... ఏం చేస్తున్నావో చెప్పనా?"

"అయ్య బాబోయ్! చూసినట్లు కరెక్ట్‌గా ఎలా చెబుతున్నావే?"

"వన్ ఇయర్ కాపురంలో నీ ఇష్టాయిష్టాలేమిటో ఆ మాత్రం తెలుసుకోలేనట్రా? అన్నట్లు... సారీరా"

"ఎందుకే.."

"నిన్న నీ మూడంతా పాడు చేసినందుకు. రేపు వీకెండ్ కదా... డబల్ ధమాకా... ఆ రెండ్రోజులూ నీవే. నాపై కక్ష తీర్చుకోవడమెలాగో ప్లాన్ చేసుకో. సాటర్‌డే. సన్‌డే వన్ మినిట్టైనా నిన్నొదిలి ఉండలేను. నన్ను కొరుక్కుతింటావో... నమిలి మింగేసి అరిగించేసుకుంటావో"

హస్కీ వాయిస్‌తో రేడియో జాకీలా విద్య అలా మాట్లాడుతుంటే... ఎంతసేపైనా వినాలనుకుంటుంది మాధవ్‌కి.

"రేపు నాచేత్తో నేనే గోరుముద్దలు తినిపిస్తాను. ఏం చేయాలో... సెలవివ్వండి" సడన్‌గా బహువచనం లోకి దిగిపోయింది.

"స్పయిసీగా కళ్లెదురుగా నువ్వుంటే చాల్లే. కడుపు నిండిపోతుంది" అంటుండగా గ్రీన్ సిగ్నల్ పడింది.

హెల్మెట్ చాటున సెల్ పట్టుకుని కంఫర్టబుల్‌గా మెడవొంచి ఆమెతో మాట్లాడుతూ స్కూటర్ నడుపుతున్నాడు మాధవ్.

పెళ్లికాక ముందు ఇద్దరి నడుమ స్వీట్ స్వీట్‌గా, హాట్ హాట్‌గా నడిచిన ఎస్సెమ్మెస్‌లెన్నో... ఎన్నెన్నో?

ప్రతి ఉదయం నిద్రలేస్తూ చెప్పుకునే అందమైన గుడ్‌మార్నింగ్‌లు.. మిడ్‌నైట్ వేళ 'గుడ్ నైట్'లు... మధ్య మధ్య అల్లరల్లరిగా పంపుకునే మిస్డ్ కాల్స్... ప్రేయసినీ, ప్రియవసీని ఆవిష్కరిస్తూ లైఫ్‌లో అంతర్భాగమైన సెల్‌ఫోన్ ఇప్పుడూ అదే ఆలంబనందిస్తూ... వారధిగా, సారధిగా నిలిచింది.

ఇష్టకష్టాలు, కోపతాపాలు, బాధ్యతలు, బంధనాలు... ఇలా అన్నింటికీ ఆసరా ఈ మొబైలే.

మాధవ్ ఆఫీసు పగలైతే... కాల్ సెంటర్‌లో నైట్ డ్యూటీ విద్యది.

బంజారాహిల్స్ రోడ్ నంబర్ ట్వల్వ్‌లో ఆఫీసు కొచ్చేదాకా మాధవ్‌తో విద్య మాట్లాడుతూనే ఉంది.

వీకెండ్–

హుషారుహుషారుగా గడిపేసారు మాధవ్, విద్య. వారిద్దరూ లుంబినీపార్క్ చుట్టేసారు. భాగమతి బోట్‌లో తథాగతుడి చుట్టూ ప్రదక్షిణలు చేసారు. బిర్లాటెంపుల్‌లో బాలాజీని దర్శించారు. ప్లానిటోరియం నుంచి నక్షత్రాలకు 'హలో...' చెప్పేసారు. భాగ్యనగరమంతా తిరిగి తిరిగి అలసి సొలసి ఇంటికొచ్చేసారు. ఆ రెండు రాత్రులు వారికి మళ్లీ శోభన రాత్రులనే తలపించగా... కంటిమీద కునుకులేకుండా జంటజాగారం చేసారు. మల్లెల పరిమళాన్ని మనసారా ఆఘ్రాణించారు.

మరువాల పరువాలను ఆస్వాదించారు. ఎవరెవరో తెలీనంతగా ఒకర్నొకరు చుట్టేసుకున్నారు.

ఇక, తెల్లారితే సోమవారమనగా విద్య అంది. ''ఆర్థికంగా స్థిరపడాలని హార్దికంగా అన్నీ కోల్పోతున్నాం. వారంలో అయిదు రోజుల పాటు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం సరే... నిండుగా సంతృప్తికరంగా చూసుకోవడమే కుదరడం లేదు. వెజిటబుల్స్ ఏం కొనాలో, షాపింగ్ ఏం చేయాలో... చివరికి మనసులోని రొమాంటిక్ ఫీలింగ్స్‌ని కూడా సెల్‌ల్లోనే చెప్పేసుకుంటున్నాం. ఒకే దగ్గర ఒకే ఇంట్లో కాపురముంటున్న– హృదయాల మధ్య దూరం కొన్ని వేల మైళ్లుంది. ఆ దూరం ఇక పెరుగనివ్వకూడదనిపిస్తోంది. డబ్బు సంపాదించే యంత్రాలుగా కాకుండా అనుభూతులను పంచుకునే హృదయ స్పందన ఉన్న మనుషులుగా బతకాలనుంది. లైఫ్‌ని షార్ట్ అండ్ స్వీట్ మెమోరీస్‌తో సార్థకం చేసుకోవాలనుంది. ఫోన్‌లు సమాచారానికే కానీ... సంసారానికి పనికిరావు. ఇకపై మనం మాట్లాడుకుందాం. సెల్‌ఫోన్లతో కాదు.... మనసుల్తో మాట్లాడుకుందాం. ఎదురెదురుగా కూర్చుని కమ్మని కబుర్లు చెప్పుకుందాం. ఉన్నంతలోనే సంతృప్తి పడదాం. ఏమంటావ్?''

వెంటనే ఏం చెప్పలేక పోయాడు మాధవ్.

కొద్ది నిముషాల తర్వాత విద్యే అంది. ''నే జాబ్‌కి రిజైన్ చేసాను. ఇంక, ఇంటిపట్టునే ఉంటాను. నీ ఆలనా పాలనా చూసుకుంటాను. ప్రతి సాయంత్రం నువ్వొచ్చేసరికి వీధి గుమ్మంలో నిలుచుని నిన్ను స్వాగతిస్తాను. పొగలు కక్కుతున్న వేడివేడి కాఫీతో సేదతీరుస్తాను. వెన్నెల కురిసే రాత్రుల్లో మనింటి ముందున్న చిన్నివాకిట్లో గులాబీ మొక్కల మధ్య ముద్దూ మురిపాలతో పాలు పంచదార కలుపుకున్న వేడన్నం కలిసి తిందాం. ఆ తర్వాత... ప్రతి రాత్రీ వసంత రాత్రిగా మలచుకుందాం. వయసు వసంతాలను మనసారా ఆస్వాదిద్దాం. నా అందమంతా వడ్డించి బెడ్‌రూంలో నీకు... నీకు మాత్రమే ప్రత్యేకంగా ఆతిథ్యమిస్తాను... సరేనా!!''




మాధవ్‌కి విద్య తీసుకున్న నిర్ణయం సమంజసమేనని పించింది. పెళ్లికాక ముందు రోజుల్లో కేవలం అరగంట మాత్రమే ఏకాంత సంకేత ప్రదేశాల్లో గడిపేవారు. మర్నాటి ఆ సన్నివేశం కోసం ఎంతగానో ఎదురు చూసేవారు. పెళ్లయితే ఇరవై నాల్గు గంటలూ ఒకరి కళ్లెదురుగా ఒకరుంటారని కలలు కనేవాళ్లు. కానీ ఇప్పుడేమైంది?

''డబ్బుతో సౌకర్యాన్ని పొందొచ్చు... సుఖాన్ని కాదు. బ్రెడ్ కొనొచ్చు. ఆకలిని కాదు. బెడ్ కొనొచ్చు. నిద్రని కాదు. నీవన్నది నిజమే... వయసంతా ఎడారయ్యాక... ఎన్ని సౌకర్యాలుంటేనేం? మోడ్రన్ లైఫ్ స్టయిలంటూ ఇద్దరం గానుగెద్దుల్లా కష్టపడి ఏం బావుకుంటాం? నువ్వు మానేసిన ఆ జాబ్ మరొకరికి ఆసరాగా ఉంటుంది కూడా...'' గ్రీన్ సిగ్నలిచ్చేసాడు మాధవ్.

ఇప్పుడు–

ఆ యాడ్‌లోని మాధవన్, విద్యాబాలన్ కొత్తగా కనిపిస్తున్నారు మాధవ్‌కి. ఇంతకాలం ఎదురెదురుగా కూర్చుని సెల్‌లో సంభాషిస్తున్నారనుకునేవాడు మాధవ్. విద్య తీసుకున్న నిర్ణయం తర్వాతనే... అది తప్పని తేలింది. ఆ ఇద్దరూ తమకొచ్చిన కాల్స్‌ని అటెండ్ చేస్తున్నారని ఎందుకనుకోకూడదనిపించిందతనికి. ఆ యాడ్ తనకిప్పుడు కొత్త భాష్యం చెబుతున్నట్లనిపించింది. ట్రాఫిక్ క్లియరన్నట్లు గ్రీన్ సిగ్నల్ పడగానే ఇంటిదగ్గర తన కోసం గుమ్మంలోనే ఎదురు చూస్తున్న విద్యను కలిసేందుకు వేగంగా స్కూటర్ ముందుకు నడిపాడు మాధవ్.

ఇప్పుడతని సంసార రథానికి ఏ రెడ్ సిగ్నల్ అడ్డుగా లేదు. ట్రాఫిక్ జాంలు అసలే లేవు.

*